# కలల నిజాల కలనేసి 'న-వల' మూలుగు

మాకినీడి సూర్యభాస్కర్

ఆధునికానంతర మార్మిక కవి శ్రీరామకవచం సాగర్ రచించిన నవల 'మూలుగు' తెలుగులో మొట్టమొదటి 'స్వప్న వాస్తవిక ప్రయోగాత్మక నవల'గా దీనిని రచయిత అభివర్ణించారు. అయితే ఈ నవల కేవలం అంతమాత్రమే కాదు. అంతకు మించిన ప్రయో గాలెన్నో ఈ నవలలో ఉన్నాయి. వాస్తవ జీవన, జీవన వాస్తవవికతకు పూర్తిగా అద్దంపట్టిన నవల ఇది. కలల నిజాల జమిలి. కలనే త నైజం కథనమౌతూ, మార్మికత కథనం సంవిధానమైంది. ఈ నవలలో మార్మికత అంటేనే సాధారణంగా అర్థంకాకపోవడం. ఈ నవల కేవలం మార్మికాత్మకం అనడం కూడా అన్యాయమే అవుతుంది. సుదీర్ఘ నిగూఢ సామాజిక తాత్త్విక శిల్పం 'మూలుగు' అదో నిశ్శబ్ద ఘోష – నిరుఘంగా – ఘోషే... రచయిత నిద్రకు బలియై, స్వాప్నిక ప్రపంచంలో ఒంటరిగా ఎన్నో రాత్రులు దిమ్మతిరిగి మితి మీరిన పారాలౌకిక మానసిక స్థితిలో చేసిన రచన ఇది. మొదలుపెట్టాక, రాయలేని స్థితికి గురై నలిగి నలిగి నలిగిపోయి తనకు తా ను విముక్తం చేసుకోడానికి చేసిన రచన ఇది. "ఏమని రాయడం? ఎలారాయడం' అనుకుంటూ, 'కాస్తా చించుతా చాలా రాత్రుళ్ళు రాయకుండా గడిపేస్తా" తన స్వాప్నిక అవస్థని గుర్తించి అక్షరీకరణం చేసుకుంటూ.... నిద్రపోనీయని తపనతో... "దుఃఖంలోంచి భ యంలోంచి ఎక్కడికి తప్పించుకుపోవాలన్నా గొలుసుతో కట్టి పడేసినట్టున్న శరీరాన్ని మరెవరి శరీరంలోనో దాంకోబెట్టి...బైటికి రావ టానికి ఏదో ఆశక్తత వెంటాడగా" వెలువడిన ఒకే ఒక్క మూల్గుగా, "భయం, శక్తిహీనత, పిరికితనం, పారిపోలేని పరిస్థితి, ఒంటరిత నం కలిగిన మృత్యుశీతల పవనాలతో కూడిన కలవరింత"గా కూరుకుపోయిన ఒక ఉన్మాద స్థితినుంచి బయటపడడానికి రాసిన న వల ఇది. కలత నిదురల కలల పలవరింతనే "డ్రీమ్ రియాలిటీ"గా ఈ నవలకో విశిష్టతను సమకూర్చాయి.

ఈ నవలలో శైలీ శిల్పాలు యావత్తూ 'డ్రీమ్‌రియాలిటీ'తో నడుస్తాయి. అధఃచేతనకు సంబంధించిన పూర్తి స్వేచ్ఛామయ ఆ లోచనలను సాహిత్యీకరిస్తూ అధివాస్తవికతను సాధించడమే డ్రీమ్ రియాలిటీగా అనుకోవచ్చు. దీనిని సాధించడానికి రచయిత రూపొందించుకున్న 'విధ్వంసక శిల్పం'లో భాగంగా డిక్షన్, సింటాక్స్ అన్నీ సాంప్రదాయలకి విరుద్ధంగా సాగుతాయి. వర్తమానంలో నే భూతభవిష్యత్కాలాలూ గజిబిజిగా అల్లుకుపోయినట్లుండే డిక్షన్ అయినా, కథనం జరుగుతున్న అనుభూతినిస్తూ ఒక రకమైనట్రా న్స్‌లోకి పాఠకుణ్ణి నెట్టేస్తుంది. పొంతనలేని కర్త కర్మ క్రియలతో, అకర్మకమైన క్రియతో కర్తను సూచించకుండా చిత్రించడం వంటి విధ్వంస భాషా శిల్పం – భూమ్యాకర్షణ శక్తిని దాటిపోయి స్వప్నశక్తి అంతఃకరణ శక్తిగా మారిన శరీర కదలికలతో మమేకమై సరి కొత్త ప్రాపంచిక చలన సూత్రాలను పఠిత అధఃచేతనలో నిక్షిప్తిస్తాయి. ఊపిరి తీయనివ్వని వాక్యవిన్యాసం. పది పన్నెండేసి పంక్తుల్లో పాతిక పైగా క్రియలు ఒకదాని వెంట ఒకటిగా సాగుతూ పాఠకుణ్ణి నిశ్చేష్ఠుడ్ని చేసేసి, ఊపిరి తీసుకోనివ్వని రీతిలో – వర్తమానం లో సాగుతూనే చిన్నపాటి వ్యవధానంతో 'అమ్మయ్య' అని ఊపిరి పీల్చుకొనేట్లు చేసి, మళ్ళీ క్రియలు పరంపరల పంక్తుల వలలోకి ప ట్టేసి, మనసును చుట్టేసి అర్థమయీ కానటువంటి స్థితిలోకి నెట్టేసి ఉక్కిరిబిక్కిరి చేసేస్తూ...స్తూనే.... ఒకే దీర్ఘ వాక్యంగా ముగియకు ండానే నవల ముగిసిపోవడం గొప్ప విస్మయాన్ని గొలుపుతుంది. ఆఖరికి అధ్యాయాల పేర్లు కూడా ఆన్‌గోయింగ్‌గానే ఉండి దీర్ఘవా క్యతకి ఆస్కారమౌతుంది. ఈ నవలలోని విశిష్టాతి విశిష్ట ప్రయోగమిది.

నవలాకాలం స్వాతంత్ర్యంకోసం పోరాటం సాగుతున్న రోజులు. నవలా నాయకుడు దావూద్, ఇతని డైరీల ఆధారంగానే కథ నడుస్తుంది. నిఖార్సయిన కమ్యూనిస్టు. అయితే, ప్రత్యేకంగా పాకిస్తాన్ ఏర్పడాలని కోరుకున్న వ్యక్తి. బాంబు కేసులో నేరస్తుడిగా అరెస్టవుతాడు. చివరికి మరణశిక్ష విధించబడుతుంది. ఈ కథ నేపథ్యంగా మధ్యలో ఎన్నో పాత్రలు ఒకదాని వెంబడి ఒకటిగా రం గ ప్రవేశం చేస్తాయి. జరీనా, ముంతాజ్ ఎలియాస్ గిరిజ, డా॥దేవసహాయం, డా॥ సమయపాలన, సక్కుబాయి, కనకదుర్గ, సి.ఐ. నాగేశ్వరరావు, పోలీసులు కళ్యాణయ్య, వరదయ్యలు, పుల్లయ్య, జమాలుద్దీన్, దొరసాని, గవర్నర్, పెంటయ్య, దొంగ జగ్గడు, జాన మ్మ, సెట్టెమ్మ, ఇర్షాద్, జన్నత్ హుస్సేన్ వగైరాలు. పాత్రల సంఖ్య ఎక్కువ కావడంచేత, వాటి మధ్య సంబంధాలు ఒకేలా ఉండకుం

డా మారుతూ ఉండడంవల్ల పాఠకుడి అవగాహనకు కొంత అసౌకర్యంగా అనిపిస్తుంది. అయితే ఈ పాత్రలన్నీ అతిసాధారణ జీవితాలనుంచి వచ్చినవే, ఏ ఒక్కపాత్రా ఆదర్శీకరింపబడలేదు, ఆఖరికి కథానాయకుడు దావూద్‌తో సహా, సాధారణ మనుషుల్లో ఉన్న సర్వసాధారణమైన బలహీనతలు, లోపాలు, రాగద్వేషాలూ అన్నింటితోనూ ఈ పాత్రలు సజీవంగా, సహజాతి సహజంగా తోస్తాయి. ఏ ఒక్క పాత్రకూడా సామాజిక నీతికి కట్టుబడి వుండదు. స్త్రీ పురుషుల మధ్య లైంగిక స్వేచ్ఛ విశృంఖలంగా వుంటుంది. ఈ విశృంఖలత్వంలోనూ నీతి నియమాలుంటాయి. సాంఘిక స్థాయితో నిమిత్తంలేకుండా ఎవరిలోనైనా ఇంచుమించు ఒకేరకమైన బలహీనతలుంటాయనే విషయాన్ని ఆవిష్కరిస్తూ పాత్ర చిత్రణ సాగుతుంది. మానవ జీవితం ఆదర్శప్రాయంగా ఉండాలని చెప్పడం అవసరమే అయినా, అలా చెప్పేది కేవలం ఊకదంపుడు ఉపన్యాసాలే అవుతాయి. ఎందుకంటే ఆదర్శం వినడానికి బాగానేఉంటుంది. ఆచరణకు వచ్చేసరికే చిల్లులు పడిపోతుంది. అందువల్ల ఆచరణలోని జీవన వాస్తవికత వేరేగా ఉంటుంది. దానిని అద్భుతంగా పట్టి చూపారు రచయిత.

ముస్లిం మైనార్టీ అస్తిత్వానికి బీజాలు పురుడు పోసుకుంటున్న తరుణంలో నవలా సమయం మొదలౌతుంది. నవలా నాయకుడు దావూద్, “ముస్లిములు ఎంత సమైక్యవాదులైనా మీ హిందువులు వాళ్ళని సవతి బిడ్డలుగానే చూస్తారు. మా అస్తిత్వం కోసం మాకు పాకిస్తాన్ కావాలంటాడు. అయితే తాను భారతదేశం వదిలి పాకిస్తాన్ పోవడానికి మాత్రం సిద్ధంగా ఉండడు. పైగా, దూదేకుల ముండావాడైన తనకు భారతదేశం వదిలిపోవాల్సిన అగత్యం లేదంటాడు. కేవలం కమ్యూనిస్టు కార్యకర్తగా జాతులు స్వయంనిర్ణయాధికారంకోసం చేసే పోరాటాలని సమర్థించాలి కనుక పాకిస్తాన్ వేర్పాటువాదాన్ని బలపరుస్తున్నానంటాడు. ఈ ఊగిసలాట దావూద్ వ్యక్తిత్వంలో లోపంగా తోస్తుంది. అతనిలోనున్న ఆరోగ్యకరమైన వైప్లవ్యదృష్టి అతన్నో విశిష్ట వ్యక్తిగా నిలబడుతుంది. తాను తప్పు చేయడంలేదనీ, చరిత్ర డిమాండ్ చేస్తున్న అదనపు కర్తవ్యాన్ని ఓ విప్లవకారుడిగా నిర్వహిస్తున్నానని, సామూహిక అలజడిని అమలుపరిచే బాధ్యతని కేవలం ఏకొద్దిమందో స్వీకరిస్తారని వాళ్ళు ప్రజలకి ప్రత్యామ్నాయ నాయకత్వ బాధ్యతలను మోస్తారని అటువంటి చైతన్యస్థితి తనలో రగలటం వెనుక అసంఖ్యాక ప్రజల మూల్గులు వున్నాయని, వారి కన్నీటిని తుడిచే తన చేతులు రాబోయే తరాలకి ఆదర్శమౌతాయనీ, అటువంటి తిరుగుబాటుతనం తన జాతి జనులనుంచే తనకు సంక్రమించిందనీ గర్వంగా భావిస్తాడు. అలాగే అతనికి సౌందర్య దృష్టి కూడా మెండు. ఆకలి దంచేస్తున్న పరిస్థితిలో ఏదోకటి తినకపోతే శోషవస్తుందనిపించిన స్థితిలో అనుకోకుండా పెయింటింగులు, పాతకాలం నాటి కత్తులు, శిరస్త్రాణాలు, చిన్న ఫిరంగులు, గడియారాలు, పింగాణీ పాత్రలూ ఉన్న మ్యూజియంలో అడుగుపెడతాడు. దాదాపుగా ఇరవై గదుల్లో వున్న రకరకాల పెయింటింగులూ వస్తువులూ చూశాక కాని తిరిగి ఆకలి గుర్తుకురాదు. సామ్రాజ్యవాదులను నరనరానా ద్వేషించే దావూద్, ఆ మాటను ధైర్యంగా దొరసానితోనే చెబుతాడు.

నవల మొత్తం ప్రతీకాత్మకం. పాత్రలు, సన్నివేశాలు అన్నీ ప్రతీకమయమే. అందువల్ల నవల ఆద్యంతము గొప్ప మార్మికతతో అలరారుతుంది. లిబర్టీ స్టాట్యూ అమెరికా సామ్రాజ్యవాదానికి ప్రతీక. నిజానికి బ్రిటీష్‌పాలనా కాలంనాటి వలసవాదంలో అమెరికా పాత్రేమీలేదు. నేటి ప్రపంచీకరణ సందర్భంలో అమెరికా నయావలసవాదం పుట్టుకొచ్చింది. దాని ఛాయల్ని లిబర్టీ స్టాట్యూ మాటల్లోను, చేతల్లోను మనంచూస్తాం. ఆస్తుల్ని జమ చేసుకోవడమే దాని పని. శిథిలగృహం భారతదేశానికి “ప్రతీక”, అందులో ఉన్న మ్యూజియం, గురించి లిబర్టీ స్టాట్యూ అంటుంది. ‘ఈ మ్యూజియంలో అరుదైన సంపద ఉంది. దాన్నిగుడి, డెత్ ఛాంబర్ లోంచి అమ్మ మూలుగు – ఇలాంటివన్నీ కూడా పాత్రలవుతాయి, “నీడకుక్క” బయటకు కనబడని మనిషిలోపని మనిషి– లేకిబుద్ధులు అంతరంగానికి చిహ్నం. పాత్రలన్నీ ఇంచుమించు ప్రతీకలు కావడంతో సందర్భాలు, సన్నివేశాలూ గహనమౌతూ వుంటాయి. పాఠకుడు జాగ్రత్తగా చదువుతూ ఆయా సన్నివేశాలను, వాటిమధ్య సంబంధాలను గుర్తించుకుంటూ, వాటిల్లో వచ్చే తేడాలను, మార్పులను గుర్తుచేసుకుంటూ సాగితేనే నవలను అర్థం చేసుకోవటం సులువౌతుంది.

నీడల్ని వ్యక్తులు, వ్యక్తుల్ని నీడలు భుజాలకెత్తుకుని, చంకల్లో వేసుకుని మోసుకుపోవడం, గిరగిర తిప్పి ఆకాశంలోకి విసిరేస్తుండటం, ఆ నీడలకి తోకలుండటం, దొంగతనాలకీ ఎక్కిళ్ళకీ లింకుండడం, బొల్లి బొల్లిని కలగజేయడంవంటి భావాలు, వాటిని ఆయాపాత్రలు చాలా సీరియస్‌గా తీసుకోవడం, దొరసాని కలల పిచ్చి. ఆకలల్ని నిజం చేయడానికి పోలీసులు, అధికారులు వేసే ప్లానులు, వేయిస్తంబాల మండపం ఉదంతం – ఇవన్నీ గొప్ప మెలోడ్రామను సృష్టించి నవ్వుతెప్పిస్తాయి.

స్వాతంత్ర్యానికి ముందు బ్రిటీష్ వలసవాద దుష్పరిణామాల్లో ఒకటి– రైతుల ఆత్మహత్యలు, ప్రస్తుతం మనం అమెరికా నయావలస వాదంలోనూ చూస్తున్నదే!. దావూద్ చిన్నప్పుడు అతని అమ్మమ్మగారి ఊళ్ళో రోజుకో రైతు ఈ ప్రపంచం మీద పోరాడే దిశలో ఆత్మహత్యలు క్రమం తప్పకుండా చేసుకుంటుండడంతో ఏలినవారు ప్రతివీధిలోను పోలీసు క్యాంప్ పెట్టి ఆత్మహత్యలు నివారణమార్గం చేపట్టారు. అదేం చిత్రమో కానీ, రోజుకో పోలీసు ఆత్మహత్యలు చేసుకోవడం మొదలౌతుంది. 'హిస్టరీ రికాపిట్యులేట్స్ హిస్టరీ!" పోలీసుల ఆత్మహత్యల్ని నయావలసవాదపు సమీప భవిష్యత్తులో మనం చూస్తామన్నమాట!. నందిగ్రామ తిరుగుబాటు దీనికి సూచనగా అనిపించడంలేదూ! అన్ని రంగాలనూ ప్రైవేటుపరం చేసేసి, ఒక 'లా అండ్ ఆర్డర్' ను మాత్రమే ప్రభుత్వరంగంలో కొనసాగిస్తూ పాలించుకున్న రాజ్యంలో ప్రజల తిరుగుబాటు అంతిమలక్ష్యం అవుతుందనే విషయాన్ని పరోక్షంగా తెలుపుతుందీ నవల. అలాగే కమ్యూనిస్టుల లొసుగుల్ని కూడా చిత్రించిందీ నవల. పార్టీలో అగ్రకులాల ఆధిపత్యం ఎక్కువనీ, వాళ్ళు తమ పొలాలని, ఆస్తులని కాపాడుకోడానికి కొత్తగా, వూళ్ళకి వూళ్ళగా తెలంగాణాలో పొలాలు చౌకగా కొనడానికి కమ్యూనిస్టులు అవుతున్నారని అభియోగిస్తాడు దావూద్. ప్రస్తుత సందర్భంలో కూడా, అమెరికా సామ్రాజ్యవాద వ్యాపార సంస్కృతిని ఈసడించుకునే పార్టీపెద్దలు, రచయితలు తమ పిల్లలను అదే అమెరికా పంపడం గొప్ప వైరుధ్యంగా తోస్తుంది.

'వుక్కబోస్తోం'దంటూ, జె.వి.ఎన్. మూర్తి 'చివరిమాట'తో అన్నట్లుగా ఈ నవల కాలంతో ఓ మార్మిక సంభాషణ... ఆత్మతో అలసటెరుగని అవిరామ వాగ్వివాదం ఇదంతాఓ దోస్తోవిస్కియన్ ప్రొటగానిజం... బోరీస్ పాస్టర్‌నాక్, ఊగిసలాట... ఫ్రాంజ్ కాఫ్కా విధ్వంస శిల్పం... గాబ్రియల్ గార్షియా మార్క్వెజ్ మాంత్రిక వాస్తవికత. ముస్లింబాధిత అస్తిత్వపు స్వప్న సాకారపు పలవరింత... భవిష్యత్ కలవరింత. గత 75 ఏళ్ళ చారిత్రక సింహావలోకనం – రష్దీ, అరుందతిరాయ్‌ల మార్గంలో నడచిన కథనం

సంప్రదాయ నవలాసాహిత్యానికో అపవాదం 'మూలుగు' సంప్రదాయ ప్రారంభంతో మొదలుకాదు. నడుమ సంఘటనలా ఒకదానికో ఒకటి అనుసంధానం కావు. మొత్తానికి మొదటి పేజీనుండి చివరి పేజీవరకు సాగిన అవ్యక్త బాధామయమైన దీర్ఘమైన మూలుగును విని జీర్ణించుకోలేనివారు అంతకంటే పెద్దగా మూలుగుతూ కంపించిపోతారు బహుశా. వారి గురించి పట్టించు కోనవసరంలేదు. అందుకే రచనలోని మార్మికతని విప్పి చెప్పాలనే అభిప్రాయాన్ని రచయిత గౌరవించినా, తన సంకేతాలని అర్థం చేసుకోలేని పాఠకులనించి తన రచనని దూరంగా వుంచటమే మేలని భావించబట్టే 'ఓఅరాచకుడి మీమాంస'లా గహన సాంద్రంగా తీర్చిదిద్దారు.

'మూలుగు' నవల స్థూలంగా చారిత్రకమే అయినా, స్వాప్నిక మాయాజాలంతో సాంప్రదాయేతరంగా ఆధునికానంతర విధ్వంసక శిల్పంతో మార్మిక నిర్మాణంతో సాగుతుంది. తెలుగు నవలాసాహిత్యాకాశంలో ఒకమైలు రాయిలా నిలిచిపోయే అద్భుత ప్రయోగం, అపస్మారక మానసిక స్వాప్నిక చంచల మాయాజాలాన్ని నిజంగానే ఒక జాలంలా ఇతివృత్తమంతటా పరుస్తూ, ఒక రచనేంద్రజాలాన్ని సృజించారు సాగర్.

స్వప్న వాస్తవ మార్మిక నిశ్శబ్దం దీర్ఘ జీవనావాస్తవికతా ప్రతీకాత్మక ప్రయోగం – 'మూలుగు'.